రోడ్లపై చెత్త.. స్థానికుల విలవిల

- న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద గుట్టలుగా చెత్తాచెదారం
- దుర్వాసనతో స్థానికులకు విష జ్వరాలు
- రైల్వే ట్రాక్ పక్కన రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు


న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద గుట్టలుగా పేరుకుపోయిన చెత్త


మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బస్తీల నుంచి వెళ్ళే నాలా పక్కన ఇలా..

హఫీజ్‌పేట్ : న్యూహఫీజ్‌పేట్ రోడ్లపై బస్తీ, కాలనీ వాసులు చెత్తను వేస్తూ డంపింగ్ యార్డులుగా మారుస్తున్నారు కొందరు. న్యూహఫీజ్‌పేట్ ఆదిత్య నగర్, ప్రేమ్‌నగర్ బస్తీలకు మధ్య ఉన్న జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద గుట్టలు గుట్టలుగా చెత్త చెదారంతో నిండింది. నిత్యం ప్రజలు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న దుర్వాస వెదజల్లుతోంది. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది బస్తీలలో నిత్యం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఫలితం లేకుండా పోయింది. ఫ్లైఓవర్ కింద, హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ అనుకొని రాత్రి సమయాలలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు. వాటిపై పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యలు ఇవే..

- స్థానికులు చెత్త చెదారం చెత్త ఆటోలలో వేయకుండా రోడ్లపైనే వేస్తున్నారు.
- పారిశుద్ధ్య కార్మికులు పరిశుభ్రం చేయకపోవడంతో గుట్టలుగా చెత్త పేరుకుపోతుంది.
- చెత్త చెదారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు జీవరాసులు తీనడంతో అజీర్ణనం కాక ప్రాణాలు వదులుతున్నాయి.
- చెత్తను చెత్త ఆటోలలో వేయకుండా రోడ్లపై, మురికి కాలువలో వేయడం వలన స్థానికులకు దుర్వాసన వస్తుంది.
- నాలలో పేరుకుపోయిన చెత్తతో రోడ్లపైకి మురుగునీరు చేరి ఇండ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.
- ప్లాస్టిక్ వ్యర్థాల బస్తీ వాసులు అనారోగ్య పాలువుతున్నారు.
- మురుగు కాలువలో గేదెలు స్నానాలు చేసి అనారోగ్య పాలువుతున్నాయి

పరిష్కారం కోసం చేయాల్సిన పనులు ఇవే..

- న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద చెత్త చెదారం వేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- నాలాలో చెత్త వేయకుండా నాలాకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి
- చెత్త వేసే చోట శుభ్రం చేసి మొక్కలు నాటి బస్తీ వాసులకు అవగాహన కల్పించాలి
- రోడ్లపై చెత్త వేసేవారిపై చర్యలు తీసుకోవాలి
- ఫ్లైఓవర్ కింద పోలీస్ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- నాలలోకి గేదెలు వెళ్ళకుండా నాలా వెంబడి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

దుర్వాసనతో సతమతం అవుతున్నాం



న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద రోజుల తరబడి చెత్త చెదారం పేరుకుపోవడంతో తన ద్విచక్ర వాహనంపై వెళ్ళాలంటే భయపడుతన్నాం. దుర్గంధం వల్ల అనారోగ్య పాలవుతున్నాం. మురుగు నీటి కాలువలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన అధికారులు చెత్తను చెత్త ఆటోలోనే వేసే విధంగా బస్తీలలో అవగాహన కల్పించాలి. చెత్త ఆటోలలో వేయని వారిపై చర్యలు తీసుకోవాలి.

– సయ్యద్, ఆదిత్యనగర్

అసంఘటిత కార్యక్రమాలపై నిఘా పెంచాలి



హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ పక్కన నుంచి మొదలుకొని ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్ వరకు రాత్రి సమయాలలో కొంత మంది యువకులు గంజాయి తాగుతూ ఊగుతున్నారు. పోలీసులు వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలి. కార్డన్ సర్చ్‌లో కూడా ఈ విషయాలపై పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళాం. కానీ కొంత మంది యువకులు మారడం లేదు.

– రాములు, ప్రేమ్‌నగర్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: గచ్చిబౌలి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పివిబి వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రశాంత్‌హిల్స్, రాయదుర్గం పోలీస్ స్టేషన్ ప్రాంతం, రాయదుర్గం, మధురానగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

- నానక్‌రాంగూడ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నానక్‌రాంగూడ, సుమధుర అపార్ట్‌మెంట్స్, శ్రీరామా స్కూల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

హఫీజ్‌పేట్ : చందానగర్, హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రకాష్‌నగర్, వినాయకనగర్, హుండయ్ షోరూం రోడ్డు, యూత్ కాలనీ, సాయినగర్ కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్ విలేజ్, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా, హఫీజ్‌పేట్ ప్రధాన రోడ్డు ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ల్యాండ్ మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసిరాం చాంబర్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.

మియాపూర్ : ఓల్డ్ ముంబాయి రోడ్డు మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నేషనల్ హైవేపై ఫ్లైఓవర్ నిర్మాణం పనుల్లో భాగంగా చందానగర్ మెయిన్ రోడ్డు బీహెచ్‌ఈఎల్ రోడ్డు ఏరియా, వేమకుంట, ఓల్డ్ ముంబాయి రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: ప్రజలంతా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిద్దిఖ్‌నగర్ కల్వరి గాస్పల్ చర్చి పాస్టర్ రెవరెండ్ టిఆర్‌రాజు సూచించారు. సిద్ధిఖ్‌నగర్‌లోని కల్వరి గాస్పల్ చర్చ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా రక్త, బీపీ షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలుచేసి అద్దాల పంపిణీ చేశారు. ఎక్స్‌రే, ఈసీజీ, పంటి పరీక్షలను చేశారు. ఉచితంగా డాక్టర్లు పరీక్షలను నిర్వహించి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పవులురు స్థానికులు పాల్గొన్నారు.

డచ్ ఐటీ సంస్థ కార్యాలయ విస్తరణ ప్రారంభం

గచ్చిబౌలి: భారతదేశంలో డచ్ ఐటీ సంస్థకు చెందిన జెబియా సంస్థ ఉత్పత్తి ఇంజనీరింగ్ కార్యాలయ విస్తరణను నాలెడ్జ్ సిటీలో డచ్ రాయబారి మార్టెన్‌వాన్‌డెన్‌బెర్గ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని అతిపెద్ద డచ్ ఐటీ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 19 దేశాలలో 6,200 మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉందన్నారు. జెబియా సహ వ్యవస్థాపకుడు సీఓఓ కిరణ్ మదునాపంతుల తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని నలుగురికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: కారు ఢీ కొనడంతో నలుగురు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన భానూర్-బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సాయిలు తెలిపిన మేరకు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన అజిత్ కుమార్ అతడి స్నేహితులు అనీస్, సురజిత్, కేశిక్, సామెన్ మైతి బతుకు దెరువు కోసం రాష్ట్రానికి వచ్చారు. పటాన్‌చెరు మండలం భానూర్‌లో ఉంటున్నారు. ఫ్లవర్స్ డెకరేషన్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 5వ తేదీ సాయంత్రం అనీస్, సురజిత్, కేశిక్, సామెన్ మైతి భానూర్ నుంచి నందిగామ వైపు వాకింగ్‌కు వెళ్లారు. భానూర్ దాటిన తరువాత భానూర్ నుంచి నందిగామ వస్తున్న కారు వీరిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని చికిత్స కోసం బీరంగూడ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అజిత్ కుమార్ తన స్నేహితులను ఢీకొట్టిన కారు డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూలో స్టార్టప్ లాంచర్ కార్యక్రమం

- దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 15 చివరి తేదీ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో స్టార్టప్ లాంచర్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తులు కోరుతున్నారు. హెచ్‌సీయూ, ది ఎంటర్‌ప్రెన్యూర్ జోన్(టీఈజెడ్) సంయుక్తంగా నిర్వహించే స్టార్టప్ యాక్సిలరేటర్‌ను లాభాపేక్ష లేని సంస్థ అయిన ఎస్పైర్ స్టార్టప్‌ల ఇంక్యుబేషన్ ద్వారా హెచ్‌సీయూలో ఆవిష్కరణ, వ్యవస్థాపక కార్యకలాపాలను నిర్వహిస్తోంది. స్టార్టప్‌లను ప్రారంభించడం, నిలబెట్టడం, వృద్ధి చేయడం కోసం కీలకమైన వ్యాపార ఇన్‌పుట్‌లను అందించడం ద్వారా వాటిని ఈ కార్యక్రమం వేగవంతం చేస్తుంది. మూడు నెలలపాటు సాగే ఈ కార్యక్రమం, మాస్టర్‌క్లాస్‌లు, ఒకరిపై ఒకరు మెంటర్‌షిప్‌లను నిర్వహిస్తారు. విద్యార్థులు, పరిశోధకులు, ఆవిష్కర్తలు, ఎస్ఎంఈలు, నిపుణులు, టెక్కీలు, కన్సల్టెంట్లు మొదలైనవారు ఈ ప్రోగ్రామ్‌కు అర్హులుగా గుర్తించారు. సంబంధిత కార్యకలాపాలను జాగ్రత్తగా చూసుకుంటూ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనడం అనేది ప్రాథమిక నిరీక్షణ. ఈ కార్యక్రమానికి ఇప్పటికే 250కి పైగా స్టార్టప్ వ్యవస్థాపకులకు మార్గదర్శకత్వం వహించడంతో పాటు మద్దతు ఇచ్చింది. కొత్త కోహోర్ట్ మార్చి 4న ప్రారంభించబడి 27 మే వరకు కొనసాగుతుంది. అందించిన వ్యాపార ఆలోచన ఆధారంగ ఎంపిక చేయబడుతుంది. దరఖాస్తులను స్వీకరించడానికి చివరి తేదీగా ఫిబ్రవరి 15గా నిర్ణయించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్ 7660857600లో సంప్రదించవచ్చు.

పీహెచ్‌డీపరీక్షలు, ఇంటర్వ్యూలలో అవకతవకలపై విచారణ చేయాలి


హెచ్‌సీయూ పరిపాలనాభవనం ముందు ఆమరణదీక్షలు చేపట్టిన ఏబీవీపీ నాయకులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఆమరణ దీక్షలను సోమవారం ప్రారంభించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ పరిపాలనా భవనం ముందు ఏబీవీపీ విద్యార్థులు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. హెచ్‌సీయూ ఏబీవీపీ నాయకులు కర్నీసింగ్, అక్షయ్, ధరమ్‌వీర్, నిఖిల్, అఖిల్‌లు ఆమరణ నిరాహార దీక్షలను చేపట్టారు.

హెచ్‌సీయూలో అణగారిన వర్గాలవారిని అణిచివేయడానికి చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామని, అన్ని వర్గాల వారికి న్యాయం చేకూర్చేలా చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటా


గోపన్‌పల్లితాండలో బస్తీబాటలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రజలకు ఇచ్చిన ప్రతీమాటను నిలబెట్టుకుంటూ ముందుకుసాగుతామని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి తాండలో ప్రజా సమస్యలపై బస్తీబాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం గోపన్‌పల్లిలాండలో భూగర్భడ్రైనేజీ, సీసీరోడ్లు, వీధిదీపాల పనితీరుపై ఆయన పరిశీలించడంతోపాటు ప్రజలను అడిగి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చే దిశగా పని చేస్తున్నామన్నారు. బీజేపీ నాయకులు హన్మంతునాయక్, శ్రీరాములు, శ్రీనివాస్, నర్సింగ్‌నాయక్, ప్రభాకర్,శేఖర్, రమేష్, వేణు, దేవేందర్, చిన్న, వెంకటేష్ నర్సింగ్‌రావు, గోవర్ధన్, స్థానికులు పాల్గొన్నారు.


అసెంబ్లీలో సోమవారం మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రసంగాన్ని వింటున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కంటి సమస్యలు లేకుండా చేయడమే కంటి వెలుగు లక్ష్యం

సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: రాష్ట్రంలో కంటి సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కమిషనరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం ఆధ్వర్యంలో 15 మంది వైద్య బృందం సీపీ ఆఫీస్‌లో సిబ్బంది అందరికీ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళద్దాలు అందించడం, చికిత్సనిర్వరిస్తామన్నారు. అయిదు రోజుల పాటు కొనసాగే కంటి వెలుగు కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కంటి వెలుగు ప్రోగ్రామ్ ఆఫీసర్, రంగారెడ్డి జిల్లా డాక్టర్ రాకేష్, సైబరాబాద్ జాయింట్ సీపీ అవినాష్‌మహంతి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యల పరిష్కారం

పటాన్‌చెరు టౌన్: ముదిరాజ్‌ల ఐక్యంగా ఉంటే సమస్యలను పరిష్కరించుకోవచ్చని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ఆధ్వర్యంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువజన విభాగం కేలండర్‌ను ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, గిరిజన అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని అన్నారు.

బోరు పాయింట్ల నిర్ధారణ


బోర్ పాయింట్లను పరిశీలిస్తున్న జియాలజిస్ట్ రామారావు, కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ రావు తదితరులు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడా కాలనీలోని థీమ్ పార్కులలో బోరు పాయింట్లను సోమవారం నిర్ధారించారు. జియాలజిస్టు రామారావు కాలనీలో అభివృద్ధి చేస్తున్న రెండు థీమ్ పార్కులలో, కవేర లే అవుట్‌లోని పార్కు స్థలంలో బోర్ పాయింట్లను గుర్తించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, కాలనీ వాసులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్‌లో నూతన హనుమాన్ ఆలయ నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ సోమవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత నిధులతో మందిర నిర్మాణానికి పూనుకొని త్వరతగతిన పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ, రాధాకృష్ణ యాదవ్, గోపాల కృష్ణ, రాజు, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఇది అంకెల గారడిగా బడ్జెట్

మియాపూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టి బడ్జెట్ అంకెలతో కూడిన మాటలతో నీటిమాటల ఉందని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ అన్నారు. మియాపూర్‌లోని స్టాలిన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సంక్షేమానికి పెద్దపీట వేసే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని అంటున్న రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడి దారులకు పెద్దపీట వేసే విధంగా బడ్జెట్ ఉందని ఆరోపించారు. ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఆర్భటంగా ప్రవేశ పెట్టారు కాని ఇప్పటి వరకు 2022–23 బడ్జెట్‌లో తెలంగాణలో సంక్షేమం కోసం ఎన్ని నిధులు ఖర్చు చేస్తే ఏ వర్గాల వారు అభివృద్ధి చెందారో తెలియజేయాలన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



వెంకటేశ్వరస్వామి రథోత్సవానికి హాజరైన భక్తులు

రాయదుర్గం: కరోనా తర్వాత మళ్ళీ ప్రజల ముందు రాయదుర్గంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన లక్ష్మణ్‌బాగ్ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టంగా పరిగణించే రథోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా ఆదివారం రాత్రి సాగింది. అర్ధరాత్రి వరకు ఈ ఉత్సవాలను కొనసాగిస్తున్నా వేలాది మంది ప్రజల జయజయధ్వా నాల, గోవింద నామస్మరణతో వైభవంగా స్వామి వారి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. ప్రత్యేకంగా అలంకారం చేసి రథాన్ని స్థానిక నాగార్జున స్కూల్ సమీపంలోని బొడ్రాయి వద్దకు భక్తులంతా కలిసి లాగి తిరిగి అక్కడి నుంచి ఆలయ ప్రధాన ద్వారం వద్దకు రథాన్ని గోవింద నామస్మరణతో నిర్వహించారు. అనంతరం భక్తులు భారీగా నినదిస్తుండగా రావాణాసుర దహన కార్యక్రమాన్ని కూడా వైభవంగా నిర్వహించారు. కరోనా తర్వాత రెండేళ్లకు మళ్ళీ ప్రజల సమక్షంలో రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడంతో వేలాది మంది పాల్గొనడం ఆ ప్రాంగణమంతా జనసంద్రంగా మారిపోయింది.


పత్రినగర్‌లో ఓపెన్ జిమ్, పిల్లల ఆటవస్తువులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

పార్కుల అభివృద్ధికి కృషి

మాదాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని అన్ని పార్కులను అభివృద్ధి చేసి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని పత్రికనగర్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో రూ.5లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పిల్లల ఆట పరికరాలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సోమవారం ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ విధిగా వ్యాయమం, యోగా, నడక అలవాటు చేసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు డీఈ రమేష్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మేఘ్రా పాల్గొన్నారు.

బీసీలకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

సాక్షి, సిటీబ్యూరో: గత ఏడాది కేటాయించిన దళిత బంధు నిధులు 17వేల కోట్లు ఎవరికి పంచారో వివరాలు వెల్లడించాలని బిఎస్పీ నేతలు డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు కొంగరి అరుణ క్వీన్,సాంబశివ గౌడ్, రాష్ట్ర కో ఆర్డినేటర్ డా.వెంకటేష్ చౌహన్ లు రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బహుజన సమాజ్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ చూసి ఎస్సీ సామాజిక వర్గాన్ని ఈ పార్టీకి దూరం చేయడం కోసమే బడ్జెట్‌లో దళిత బంధుకు 17వేల కోట్లతో పాటు ఎస్సీ సంక్షేమానికి 37 వేల కోట్లు కేటాయించారని ఆరోపించారు. బిసిలకు ప్రస్తుత బడ్జెట్లో తీవ్ర అన్యాయం జరిగిందని,.తెలంగాణ మొత్తం జనాభాలో సగం బిసిలు ఉంటే బడ్జెట్ మాత్రం కేవలం మూడు శాతం మాత్రమే కేటాయించారని మండిపడ్డారు.1.5 లక్షల కోట్లు కేటాయించాల్సిన చోట కేవలం 6వేల కోట్లు ఇచ్చి బిసిలపై వివక్ష చూపారన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 40 మందికి మంజూరైన రూ.16.96లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. పూర్తి పారదర్శకతతో, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్ గౌడ్, నాయకులు వెంకటేష్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, ప్రకాష్ చారి, రాజేష్, షేక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

హత్నూరలో...

హత్నూర(సంగారెడ్డి): అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రి ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ వరమని రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని పన్యాల గ్రామానికి చెందిన అంజద్ ఖాన్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.56వేల చెక్కును సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదగిరి, వార్డు సభ్యులు వీరేశం, బ్రహ్మచారి, నాయకులు ఖాజా, పాషా, కృష్ణాగౌడ్, రాజు, బాలయ్య పాల్గొన్నారు.

ఖేడ్‌లో...

నారాయణఖేడ్: నాగల్‌గిద్దా మండలం కారాముంగి గ్రామానికి చెందిన ఠాకూర్ సంజీవ్‌సింగ్‌కు మంజూరైన రూ.45వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు డా.సంజీవరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కారాముంగి, రాజారాంతండా సర్పంచ్‌లు గుండేరావుపాటిల్, పల్లవి పాల్గొన్నారు.

కల్యాణోత్సవంలో పూజలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో సోమవారం నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ఎల్లమ్మ తల్లి, శ్రీ బీరప్ప కామరతి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి, గొంగడి కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, సర్పంచ్ కుర్మ నర్సమ్మ, మాజీ ఎంపీటీసీ పట్నం రాజు, నాయకులు నగేష్, తులసి రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.